క్లుప్తంగా

నేడు ఫెర్టిలిటీ క్యాంప్

అయిజ: మండలంలోని భూంపురంలో సోమవారం నిర్వహించాల్సిన ఫెర్టిలిటీ క్యాంప్ అనివార్య కరాణాలతో వాయిదా పడిందని, గురువారం తిరిగి నిర్వహించనున్నట్లు వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూపారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతులు అందుబాటులో ఉండి, వారి పశువులకు పరీక్షలు చేయించాలని, అదే విధంగా పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

శివశంకర ఆలయానికి హుండీ బహూకరణ



గద్వాలన్యూటౌన్: స్థానిక తెలుగుపేటలోని శివశంకర ఆలయానికి కానుకలు వేసే హుండీని బుధవారం అదే వీధికి చెందిన శ్రీహరి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీహరి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ డీటీడీసీ నర్సింహులు, కౌన్సిలర్లు అ నిత, శ్రీనివాసులు, శివ భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరుణ్ రషీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండాకు చెందిన సంధ్య(24) ఆత్మహత్య చేసుకోగా.. బుధవారం కేసు నమోదు చేసి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజాప్రతినిధి కుమారిడిపై అనుమానాలు

గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి కుమారుడు వేధింపులకు గురిచేయడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ప్రజాప్రతినిధి కుమారిడి లైంగిక వేధింపులే కారణమా లేక బతుకు భారమై ఆత్మహత్యకు పాల్పడిందా అనేది గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తండాలో ఇరువర్గాలు ఘర్షణలు కూడా చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శ్రీశైలానికి స్వాముల పాదయాత్ర



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో బుధవారం 12 మంది శివస్వాములు ఇరుముడి ధరించి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. ప్రతి రోజు నియమ నిష్టాలతో శివుడికి పూజలు నిర్వహించి, శివ దీక్షతో మాలధరించి శివరాత్రి రోజు శివ మాలవిరమణ పొందనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామం మొత్తం శివ నామస్మరతో మారుమోగింది.

విద్యార్థులతో పనులు



మానవపాడు: ప్రభుత్వ పాఠశాలలు.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించాలనే కల.. కలగానే మిగులుతోంది. ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు బిందె ద్వారా పాఠశాలకు నీరు తెప్పిస్తున్నారు. పాఠశాలకు వచ్చే బాలికలు దాదాపు 200 మీటర్ల దూరం వచ్చి తాగటానికి నీరును బిందె ద్వారా తీసుకెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులతో పనులు చేయించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

మానవపాడు: ప్రతి ఆరోగ్య సబ్‌సెంటర్లలో ప్రతి బుధవారం, శనివారం వ్యాక్సిన్ మండల కేంద్రం నుంచి ఆయా ఆరోగ్య ఉపకేంద్రాలకు తరలిస్తారు. మండలంలోని పెద్ద పోతులపాడు ఆరోగ్య ఉపకేంద్రానికి ఆశ ద్వారా వ్యాక్సిన్ తరలిస్తున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆన్‌లైన్ సేవలు అందేనా?



మానవపాడులో పంచాయతీ కార్యదర్శులకు ఈ-పంచాయతీ సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఈ- పంచాయతీల్లో ఇబ్బందులు
- పని ఏదైనా మండల కేంద్రానికి వెళ్లాల్సిందే..
- టి ఫైబర్ పనులు పూర్తయినా.. నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన

మానవపాడు: పల్లె ప్రజలకు గ్రామసచివాలయంలో అన్ని రకాల సేవలు అందించేలా ఈ- పంచాయతీ సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాలు ఉన్నాయి. వాటిలో 124 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామపంచాయతీలకు టీఐ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ ద్వారా అందుబాటులోకి వచ్చినా.. పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందించలేకపోతుండటాన్ని పల్లె ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏ పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి తీసుకొచ్చేలా..

ఐదేళ్ల కిందట పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా ఈ-పంచాయతీ సేవలకు శ్రీకారం చుట్టింది. గ్రామానికి చెందిన ప్రజలు తమకు అవసరమైన కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు వివాహ ధ్రువీకరణ పత్రం కుడా పంచాయతీలోనే పొందేలా సేవలందిస్తామని పాలకులు, అధికారులు పేర్కొన్నారు. కానీ.. ఇప్పటికి అమలు అంతంత మాత్రమే ఉంది. ఇవే కాక ఇంటినిర్మాణం అనుమతులు, పన్నుల వసూలు కుడా ఆన్‌లైన్‌లోనే పంచాయతీ కార్యలయాల వద్ద చేపట్టాల్సి ఉన్నా.. ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు.

త్వరగా అందుబాటులోకి..



మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగులున్న టి -ఫైబర్ ద్వారా ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిని క్షేత్రస్థాయిలో అమలు చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామాల్లో కులం, ఆదాయం, మరణ, వివాహ, జనన ధృవీకరణ పత్రాలు అందిస్తే బాగుంటుంది. అప్పుడే పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు.

– సంజీవనాయుడు, గోకులపాడు.

ఆన్‌లైన్ ద్వారానే సేవలు

పంచాయతీల్లో ఈ-సేవలు పూర్తిస్థాయిలో అందాల్సి ఉంది. మండలంలో 16 గ్రామపంచాయతీలు ఉండగా.. టి-ఫైబర్ విధానం ఇంకా 4 గ్రామాలకు చేయాల్సి ఉంది. రికార్డులు ఆన్‌లైనన్ విధానంలోనే కొనసాగుతున్నాయి. జనన, మరణ, వివాహ, ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నాం.

– రమణరావు, ఎంపీడీఓ, మానవపాడు

పావనంపల్లిలో 'కంటివెలుగు' ప్రారంభం



పావనంపల్లిలో కంటి వైద్యసిబ్బందితో డాక్టర్ నవీన్‌కుమార్

మల్దకల్: మండలంలోని పావనంపల్లిలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగు కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షల నిమిత్తం వచ్చే వారికి వైద్య సిబ్బంది ముందుగా పేర్లు నమోదు చేసుకొని వారికి టోకన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కుమార్, స్వరూపారాణి, శారదమ్మ, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు

గట్టు: కంటి వెలుగు శిబిరాలు గట్టు, లింగాపురం గ్రామాల్లో కొనసాగుతున్నాయి. బుధవారం ఆయా గ్రామాల్లో మొత్తం 358 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. 16 మందికి రీడింగ్ అద్దాలు, 11 మందికి ఆర్డర్ అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిమ్మప్ప, నరేష్, వైద్య సిబ్బంది వెంకటాద్రినాయుడు, పార్వతి, తాహేరా, విఘ్నేశ్వరి, జయమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● గురువారం గంగిమాన్‌దొడ్డి, మిట్టదొడ్డి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



డ్యాన్స్ కాంపిటీషన్‌లో పాల్గొంటున్న విద్యార్థులు



డ్యాన్స్ కాంపిటీషన్‌ను చూసేందుకు తరలివచ్చిన వివిధ గ్రామాల ప్రజలు

అయిజ: పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ సమీపంలో ఈ నెల 13 నుంచి మండల స్థాయి నృత్య పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో భాగంగా మంగళవారం రాత్రి మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డ్యాన్స్ కాంపిటీషన్ చూసేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.20,016, ద్వితీయ బహుమతి రూ. 10,016, తృతీయ బహుమతి రూ.5,016 ప్రకటించారు. గురువారం వరకు డ్యాన్స్ కాంపిటీషన్ పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పేదలను ఆదుకోవడమే లక్ష్యం



అలంపూర్ చౌరస్తాలో సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

- ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం

అలంపూర్: పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆరోగ్య విషయంలో ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షమే పథకాలు మన రాష్ట్రంలో కొనసాగడం అదృష్టమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని యావత్ భారత దేశం కోరుకుంటుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు సీఎం సహాయ నిధి ద్వారా 1,500 మందికి దాదాపు రూ.4.50 కోట్లు అందించినట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజలకు వైద్యసేవలు మెరుగుపర్చడానికి వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మార్చి చివరి నాటికి వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి వస్తోందన్నారు. రాబోయే కాలంలో అలంపూర్ నియోజకవర్గం వైద్యానికి నిలయంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయిజ మండలంలో 10 చెక్కులు, ఇటిక్యాల మండలంలో 10 చెక్కులు, ఉండవెల్లిలో 04, వడ్డేపల్లిలో 04 చెక్కులు, అలంపూర్ మండలంలో 03, రాజోలి మండలంలో 02, మానవపాడు మండలంలో 1 చెక్కు మొత్తం 34 మంది లబ్ధిదారులకు రూ.18,03,500 చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాశపోగు రాజు, వైస్‌ఎంపీపీ దేవన్న, శ్రీనివాస్ గౌడ్, దామోదర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రాముడు, రవి రెడ్డి, బాషుమియ్య, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఎమ్మెల్యే పరామర్శ

అలంపూర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం పరామర్శించారు. రాజోలి మండలం ముండ్లదిన్నెకి చెందిన సహకార సొసైటీ డైరెక్టర్ వెంకట్రామన్ గౌడ్ మనవడు జ్ఞానేశ్వర్ తీవ్ర జ్వరం, ఊపిరితిత్తుల ఇబ్బందితో కర్నూల్‌లో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యచికిత్స అందించాలని సూచించారు.

'రాజ్యాంగానికి మించిన గ్రంథం లేదు'



మానవపాడు అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న నాయకులు

మానవపాడు: రాజ్యాంగానికి మించిన గ్రంథం మరొకటి లేదని, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు తెలిపారు. బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచలోనే అతిపెద్ద రాజ్యాంగం మనదని, అలాంటి రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేయటం, అమ్మడం, రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేసి రాజ్యాంగ స్వరూపం మార్చి కోరలు లేని పాములను చేయాలని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు నాగన్న, బీసన్న, ఉసేన్, కృష్ణ, మద్దిలేటి, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేరువలో సహకార బ్యాంకులు



గట్టులో అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ చైర్మన్

గట్టు: సహకార రైతులకు మరింత చేరువలోకి సహకార బ్యాంకులను తీసుకొస్తున్నట్లు డీసీసీబీ మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. బుధవారం గట్టు సహకార సంఘంలోఅధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో రైతులకు ఆన్‌లైన్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడారు. సహకార బ్యాంకుల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని కోరారు. సహకార బ్యాంకుల ద్వారా నూతన గృహానికి రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. విదేశీ విద్యకు బ్యాంకు ద్వారా రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. పాత బకాయిలను రైతులు చెల్లించి, సహకార బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. బ్యాంకు లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, ఉపాధ్యక్షుడు మహదేవప్ప, ఎంపీటీసీ బొజ్జయ్య నాయుడు, బ్యాంకు సూపర్‌వైజర్ శ్రీరాములు, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌వాహబ్, బీఆర్ఎస్ నాయకులు రామునాయుడు, గోవిందు, వీరారెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



ముచ్చోనిపల్లెలో కార్యకర్త కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటున్నట్లు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ముచ్చోనిపల్లెకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వేమన కుటుంబానికి పార్టీ తరఫున రూ.2 లక్షల చెక్కును గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్వయంగా కార్యకర్త ఇంటికి వెళ్లి అందజేశారు. ఇటీవలే వేమన ప్రమాదవశాత్తు మృతి చెందగా, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో పార్టీ అందించే రూ.2 లక్షల బీమా డబ్బులను కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పేదల ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా పేదల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, జిల్లా ఎంపీపీల ఫోరమ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, హనుమంతునాయుడు, గోవిందు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

శివస్వాముల ప్రత్యేక పూజలు

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని శివాలయంలో శివ మాలధారులు బుధవారం మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశిస్సులు పొంది మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్వయంగా శివస్వాములకు భిక్షను వడ్డించి మాట్లాడారు. పవిత్రమైన మాఘ మాసం నుంచి శివస్వాములు దీక్షలను ఎంతో కఠినంగా నియమ, నిబంధనలతో 41 రోజులు భక్తిశ్రద్ధలతో పరమశివుడి మాలధారణతో ప్రతి ఒక్కరిలో నూతన ఉత్తేజం, పవిత్రత వెల్లివిరుస్తుందన్నారు. శివుడి ఆశిస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ జంబురామన్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ రాజశేఖర్, ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి



సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ధరూరు: ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని, పథకాలన్నీ ప్రజలకు చేరవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ నజీమున్నీసా బేగం అధ్యక్షతన మండల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు తరువాత అనేక సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయన్నారు. ప్రధానంగా రైతులకు సంబంధించి ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు బంధు, వంటి పథకాలు దేశంలో ఎక్కడా లేవని, వాటని మన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్నారన్నారు. కొన్ని రాష్ట్రాలు మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. త్వరలోనే ప్రతిఒక్కరికీ సొంతింటి కళను నెరవేర్చబోతున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని కరెంటు సమస్య లేకుండా చూడాలని సభలో సభ్యులు కోరారు. చాలా గ్రామాల్లో కరంటు కోతల కారణంగా పంటలెండుతున్నాయని విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. అంతకు ముందు వైద్య, విద్య, విద్యుత్, వ్యవసాయ, ఐకేపీ, ఉపాధి, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ ఎండీ జబ్బార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పరమేష్, సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీలు డీఆర్ శివలీల, దౌలన్న, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం



గొర్లఖాన్‌దొడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

గట్టు: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి తెలిపారు. ప్రజాగోస, బీజేపీ భరోసా యాత్రలో భాగంగా బుధవారం గొర్లఖాన్‌దొడ్డిలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం కోసం, దేశ సంక్షేమం కోసం ధర్మ బద్ధంగా పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాలు భారత దేశం వైపు చూసేలా నరేంద్రమోదీ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. కేంద్రంతో పాటుగా రాష్ట్రంలో కూడా బీజేపీ ఉండే తెలంగాణ అభివృద్ధి శరవేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డు పడుతున్నట్లు ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీకి మంచి ఆదరణ ఉందని, గద్వాలలో డీకే అరుణను ఆదరించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగప్ప, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సిద్ధప్ప, బూత్ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ అభివృద్ధికి కృషి

మల్దకల్: బీజేపీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు గడ్డం కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మల్దకల్‌లో బీజేపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ పార్టీ విఫలమైందని ఆరోపించారు. అనంతరం గ్రామంలోని బూత్‌లకు ఇన్‌చార్జీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, దామ నాగరాజు, లక్ష్మన్న, దామ వెంకటేష్, రాముడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల గోడు ప్రభుత్వానికి పట్టదా



చిన్నోనిపల్లె భూ నిర్వాసిత రైతులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

గట్టు: భూ నిర్వాసిత రైతులపై తెలంగాణ చిన్నచూపు చూస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి బుధవారం లింగాపురం, చిన్నోనిపల్లె గ్రామాల్లో పర్యటించారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ఐదు గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులు 388 రోజులుగా చేస్తున్న ఆందోళన శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి సందర్శించి, సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పటేల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు సర్వం కోల్పోయి కన్నీరు పెట్టుకుంటున్నట్లు ఆరోపించారు. భూ నిర్వాసితులపై జాలి చూపాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారించడం దారుణమన్నారు. తెలంగాణలో పాదయాత్ర చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని చిన్నోనిపల్లెకు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తక్షణమే చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి శంకర్, నాయకులు బల్గెర నారాయణ రెడ్డి, గౌస్, షేక్‌జామాల్, రవినాయుడు, రాజేంద్ర, అలెగ్జాండర్, మైనుద్దీన్ పాల్గొన్నారు.

క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

అలంపూర్ రూరల్: క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అజయ్ అన్నారు. అలంపూర్ పట్టణంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇందులో 50 టీంలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు ఉన్నట్లు తెలిపారు. మొత్తం 15 రోజుల పాటు క్రికెట్ పోటీలు కొనసాగుతాయని వినోద్, అరవింద్, నవీన్, మహబుబ్, అమీర్‌ఖాన్ తెలియజేశారు. ఈ సందర్భంగా – బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అజయ్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రికెట్‌తో పాటు ఇతర జాతీయ క్రీడల్లో రాణించి, మంచి గుర్తింపు తెచ్చుకోవాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ శేకర్‌రెడ్డి, అల్లబకాష్, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.



కేసు నమోదు

గద్వాల క్రైం: ఓ మహిళ ఉద్యోగితో అనుచితంగా వ్యవహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. ఒంటిల్‌పేట కాలనీకి చెందిన రవి అదే కాలనీకి చెందిన ఓ ప్రభుత్వ మహిళ ఉద్యోగితో కొన్ని రోజుల నుంచి దురుసుగా వ్యవహరిస్తూ.. విధులకు ఆటంకం కలిగిస్తున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సదరు మహిళ బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేయగా దురుసుగా వ్యవహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.